క్లుప్తంగా

ఆలయానికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో ఉన్న అలిమేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

విద్యార్థినులకు చదరంగం పోటీలు

కొత్తపేట: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బాలికలకు చదరంగం పోటీలు నిర్వహించారు. పక్షోత్సవాల కన్వీనర్ కోటిపల్లి దామోదర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, ప్రముఖ అంతర్జాతీయ శిల్పి రాజ్‌కుమార్ వుడయార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముందుగా పోటీలను రాజ్‌కుమార్ ప్రారంభించగా.. చదరంగం విజేతలకు అడబాల, పాలూరి, ఉపసర్పంచ్ విళ్ల మారుతీ ప్రసాద్, రాష్ట్ర యువ మోర్చా అధికార ప్రతినిధి జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

జనార్దనస్వామికి తొలి హారతి

ఆలమూరు: గ్రామంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో భక్తుల తాకిడి అధికమైంది. శనివారం తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకులు ప్రభాకరాచార్యులు అందించిన తొలిహారతికి భక్తులు స్వీకరించి నీరాజనాలు పలికారు. అలాగే ఎంపీడీఓ రాజు ఆలయానికి వచ్చి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానని ఆలయ కమిటీ చైర్మన్ బైరిశెట్టి రాంబాబుకు హామీ ఇచ్చారు.

కొనసాగుతున్న దస్తావేజు లేఖర్ల నిరసన

మామిడికుదురు: రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విధానాలను నిరసిస్తూ మామిడికుదురు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట శనివారం రెండో రోజు కూడా దస్తావేజు లేఖర్లు నిరసన తెలిపారు. పెన్‌డౌన్ చేసి విధులను బహిష్కరించారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల అటు ప్రజలు, ఇటు తాము చాలా విలువైన సమయాన్ని వృథా చేసుకోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. నిరసనలో మండల శాఖ అధ్యక్షుడు జక్కంపూడి సత్యనారాయణ, కార్యదర్శి కోలా సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మలికిపురం: మండలంలోని కేశనపల్లిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కలవకొలను రాంబాబు కుటుంబానికి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ సొసైటీ శనివారం సాయం అందించింది. రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల రెడ్‌క్రాస్ కార్యక్రమాల సమన్వయకర్త జంపన బుజ్జి రాజు చేతుల మీదుగా వంట సామాగ్రి, బియ్యం, కూరగాయలు అందించారు.

ఉత్తమ ఫలితాలతో భవిష్యత్‌కు పునాది



అవిడి పాఠశాలలో మొక్కలు నాటుతున్న డీఈఓ సలీం బాషా

కొత్తపేట: ప్రాథమిక స్థాయి నుంచే ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఉన్నత భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని డీఈఓ షేక్ సలీం బాషా విద్యార్థులకు ఉద్బోధించారు. శనివారం ఆయన మండలంలోని అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పలు తరగతులకు వెళ్లి పాఠ్యాంశాలు ఎంతవరకు పూర్తయ్యాయి? ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల విద్యాభ్యాసం, మార్కుల వివరాలు తదితర అంశాలను ఆరా తీశారు. ముఖ్యంగా పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం తీరు తెన్నులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి డీఈఓ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. హెచ్ఎం అరుణశ్రీ,, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమావేశాలు

సఖినేటిపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో క్లస్టర్ సమావేశాలను విద్యాశాఖ శనివారం ఏర్పాటు చేసింది. మండలంలోని 63 ప్రాథమిక, 15 ఉన్నత పాఠశాలల టీచర్లకు అంతర్వేదికర, సఖినేటిపల్లి, రామేశ్వరం, మోరి క్లస్టర్లల్లో పై సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్వేదికర పాఠశాలలో నిర్వహించిన సమావేశాన్ని జిల్లా ఉపవిద్యా శాఖాధికారి సూర్యప్రకాష్ సందర్శించారు. ఉపాధ్యాయులకు ఆయన సూచనలు చేశారు. టీచర్ లెర్నింగ్ మెటీరియల్‌ను పరిశీలించారు. క్లస్టర్ హెచ్ఎం ఎం.ప్రసూనాంబ, హెచ్ఎంలు పాల్గొన్నారు.

బురదలో నడకయాతన..!

- భారీ వర్షాలకు అధ్వానంగా రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- అభివృద్ధి చేయాలని వినతి

ఆలమూరు: దేశానికే రైతు వెన్నుముక.. పల్లెటూళ్లు దేశానికి పట్టుకొమ్మలు.. అన్నదాత అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి వైపు పయనిస్తుందంటూ.. అనునిత్యం అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులు తమ ప్రసంగాల్లో పొగడ్తలతో ముంచెత్తుంటారు. వాస్తవిక పరిస్థితులకు వచ్చేసరికి క్షేత్రస్థాయిలో ఎదుర్కొన్న సమస్యలను పట్టించుకునే నాథుడే లేడనే అభిప్రాయం రైతుల్లో నెలకొంటుంది. రైతుల నుంచి ప్రతి ఏటా రూ.కోట్లలో నీటి తీరువా, సెస్ రూపంలో పన్నులు వసూలు చేసున్న ప్రభుత్వం వారికి అవసరమైన, ఉపయోగమైన పుంతరోడ్ల అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదు. పంట ఉత్పత్తులను తరలించుకునేందుకు, వ్యవసాయ పనులను చేపట్టేందుకు కనీస మరమ్మతులు చేయాల్సిన పుంతరోడ్లను ఏళ్ల తరబడి పట్టించుకోకపోవడంతో రైతులను మనోవేదన చెందుతున్నారు. ఎస్ఆర్‌జీఈఎస్‌లో నిధులున్నా.. పుంతరోడ్లను పట్టించుకునే పరిస్థితి లేకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. అలాగే కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని అన్ని గ్రామాల్లో గతేడాది గ్రామ సభలను ఏర్పాటు చేసి చేపట్టాల్సిన సుమారు 150 కిలోమీటర్ల మేర పుంతరోడ్ల అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. అయినా దీనిపై ఇప్పటివరకూ స్పష్టత లేకుండా పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రహదారుల సౌకర్యాలు లేక..

క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాల్లో గతంలో నిర్మించిన అనేక రోడ్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చిత్తడి చిత్తడిగా మారి బురదగుంటలను తలపిస్తున్నాయి. అసలే వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని రైతులు బాధపడుతున్న తరుణంలో పొలాలకు వెళ్లేందుకు కూడా సరైన సదుపాయాలు లేక విలవిల్లాడుతున్నారు. తమ తమ పశువుల మకాంకు వెళ్లి పాలు తీసుకొచ్చేందుకు బురదగుంటల్లోనే వెళ్లాల్సి రావడంతో తీవ్ర ప్రయాస పడుతున్నారు. ద్విచక్రవాహనం వెళ్లే అవకాశం లేకున్నా కనీసం నడవడానికి కూడా పరిస్థితి అనుకూలించకపోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పశువులకు గడ్డిని కోసుకుని వాహనాల మీద తరలిద్దామంటే రవాణా సౌకార్యాలు అనువుగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెస్‌ల రూపంలో రైతులు రూ.కోట్లు చెల్లిస్తున్నా ఆ మేరకు అభివద్ధి చేయకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం పంచాయతీలకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ నిధుల కొరత రానీయకుండా చేస్తామన్న ప్రకటనలను వాస్తవ రూపం దాల్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదాతల నిరుత్సాహం

వరిపంట కంకి దశకు చేరుకుంటున్న తరుణంలో క్రిమి రసాయన మందులు, కలుపుతీత వంటి పనులు చేపట్టాల్సి ఉంది. దీనికి తోడు పశుగ్రాసం అనునిత్యం పొలం గట్లకు వెళ్లాల్సి ఉంటుంది. ఇటువంటి తరుణంలో పుంతరోడ్లు అక్కరకు రాకపోవడంతో రైతుల నుంచి తీవ్ర నిరుత్సాహం వ్యక్తమవుతుంది. బురదమయంగా తయారైన రోడ్లపైనే రైతులు రాకపోకలను సాగిస్తున్నారు. ఇకనైనా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు సత్వరమే స్పందించి సత్వరమే పుంతరోడ్లను అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

> **పుంత రోడ్ల అభివృద్ధికి చర్యలు**
>
> 
>
> మండలంలో తీవ్ర సమస్యగా మారిన పుంత రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే గుర్తించిన, దెబ్బతిన్న పుంతరోడ్ల నిర్మాణంపై అంచనాలు సిద్ధం చేశాం. ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాగానే పుంత రోడ్లను అభివృద్ధి చేస్తాం.
>
> –ఏ.రాజు, ఎంపీడీఓ, ఆలమూరు.



బురదమయంగా సంధిపూడి– చింతలూరు పుంతరోడ్డు



పెదపళ్లలో అధ్వానంగా ఉన్న పుంతరోడ్డు

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం



సమావేశంలో పాల్గొన్న కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు

మామిడికుదురు: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు బలంగా వినిపించాలని పి.గన్నవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పాశర్లపూడిలో మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు స్వగృహం వద్ద శనివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము అధ్యక్షత వహించారు. అనుబంధ కమిటీలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమర్థులైన వారినే కమిటీల్లో నియమించాలన్నారు. చలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపింది. ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను నిరసన కార్యక్రమాల ద్వారానే ఎండగట్టాలని శ్రీనివాస్ పేర్కొన్నారు. అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన పార్టీ సీనియర్ నేత చిట్టూరి రామకృష్ణ మృతికి సంతాపం తెలిపారు. సమావేశంలో పార్టీ నేతలు నీతిపూడి గణేష్‌బాబు, జక్కంపూడి వాసు, నెల్లి దుర్గాప్రసాద్, జోగి రామకృష్ణ, గెద్దం వెంకటేశ్వరరావు, అన్వర్ తాహిర్ హుస్సేన్, చిక్కం బుజ్జిబాబు, బత్తుల గంగారత్నం తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కొత్తపేట: మహిళల ఆరోగ్యం శక్తివంతమైన కుటుంబ నిర్మాణానికి కీలకమని ఎంపీపీ మార్గన గంగాధర రావు అన్నారు. మండలంలోని అవిడి పీహెచ్‌సీ వద్ద స్వస్త్ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యులు దూళి సూరిబాబు పాల్గొన్నారు.

రాజోలు: మహిళా ఆరోగ్యం ద్వారానే కుటుంబ ఆరోగ్యం కలుగుతుందని తాటిపాక పీహెచ్‌సీ డాక్టర్ దివ్యదర్శిని అన్నారు. తాటిపాక–2 సచివాలయం పరిధిలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్ వద్ద స్వస్త్ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరం నిర్వహించారు. మహిళల్లో వచ్చే క్యాన్సర్ వ్యాధిని గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించారు. ఆయుర్వేద వైద్యురాలు యామిని పలువురు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

ఆలమూరు: మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్ నారీ– సశక్తి పరివార్ అభియాన్ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌లు నేలపూడి లావణ్య, కందిబొట్ల శ్రీనివాసు అన్నారు. మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల పరిధిలోని ఆలమూరు, నర్సిపూడి గ్రామాల్లో వైద్యాధికారులు ఎన్.లక్ష్మీ స్నేహలత, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో శనివారం అభియాన్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఐసీడీఎస్ అధికారులు సమకూర్చిన పౌష్టికాహారం పంపిణీ చేశారు. గ్రామ కార్యదర్శి కె.మోక్షాంజలి, సీహెచ్ఎ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ జ్యోతికుమార్ పాల్గొన్నారు.

రహదారులను ముంచెత్తిన వర్షం



అప్పనపల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మామిడికుదురు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శనివారం మధ్యాహ్నం మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులపై భారీగా ముంపు నీరు నిలిచిపోయింది. ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. జాతీయ రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గంటకుపైగా కురిసిన వర్షంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. అప్పనపల్లి, మొగలికుదురు, గెద్దాడ తదితర గ్రామాల్లో ప్రధాన రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం



పుల్లేటికుర్రులో బ్యాడ్మింటన్ రాకెట్‌లను అందిస్తున్న పూర్వ విద్యార్థులు, ఎంపీడీఓ

అంబాజీపేట: విద్యార్థులకు అవసరమైన రూ.21 వేలు విలువైన క్రీడా పరికరాలను సమకూర్చిన పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని హెచ్ఎం వెంకట్రావు అన్నారు. మండలంలోని పుల్లేటికుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1996–97 పదో తరగతి పూర్వ విద్యార్థులు బి.సురేష్, నీతిపూడి విలసిత మంగతాయారు, ఏలూరు వెంకట్, పి.బూరుగులమ్మలు రూ.14 వేలు విలువైన నాలుగు బాల్ బ్యాడ్మింటన్ రాకెట్స్, 1986–87 బ్యాచ్ పూర్వ విద్యార్థి కె.అద్ని కుమార్ రూ.7వేలు విలువైన రెండు బాల్ బ్యాడ్మింటన్ రాకెట్లను వెంకట్రావు, పీడీ అందే సూర్యనారాయణకు అందజేశారు. క్రీడా పరికరాలను అందజేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.మమత, సర్పంచ్ జల్లి బాలరాజు, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ ఎన్.రత్నమాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య సమతుల్యతను కాపాడాలి



పుల్లేటికుర్రులో జ్యూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అంబాజీపేట: ప్రకృతిలో జీవ వైవిధ్య సమతుల్యతను కాపాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. గ్రీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూలులో శనివారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, 2047 నాటికి పచ్చదనం 50 శాతానికి చేరుకోవడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రపంచ సమస్యగా మారిన ప్లాస్టిక్ వ్యర్థాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, ప్రజా భాగస్వామ్యంతో పచ్చదనం పెంపుదలకు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ భూతాన్ని అరికట్టే చర్యల్లో భాగంగా జ్యూట్ బ్యాగులను వినియోగించాలని సూచిస్తూ జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శాంత లక్ష్మి, తహసీల్దార్ బొంతు చినబాబు, సర్పంచ్ జల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు

కొత్తపేట: వివాదాస్పద వ్యాఖ్యలతో ఫ్లెక్సీలు ప్రింట్ చేస్తే సంబంధిత ఫ్లెక్సీ ప్రింటర్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక డీఎస్పీ సుంకర మురళీమోహన్ హెచ్చరించారు. ఇటీవల వివిధ సందర్భాల్లో వివాదాస్పద వ్యాఖ్యలతో కూడిన ఫ్లెక్సీలు ప్రదర్శించడం, ఇరు సామాజికవర్గాల మధ్య వివాదం ఏర్పడి శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని 10 మండలాల ఫ్లెక్సీ ప్రింటర్స్‌కు స్థానిక కార్యాలయంలో శనివారం డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న సినిమాలు, దసరాకు, పలు ఉత్సవాలకు సంబంధించి ఎక్కడైనా నిబంధనలు అతిక్రమించి, ఇతర వర్గాలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు గాని, సూచన, అనుచితమైన వ్యాఖ్యలతో ఫ్లెక్సీలు కనపడితే ఆ ఫ్లెక్సీలు ప్రింట్ చేసిన వారినే బాధ్యులుగా గుర్తించి వారికి శిక్ష పడేలా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రావులపాలెం టౌన్, పి.గన్నవరం సీఐలు శేఖర్‌బాబు, భీమరాజు, కొత్తపేట ఎస్ఐ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెముడులంక విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు: మండలంలోని చెముడులంక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఉషు పోటీల్లో చక్కని ప్రతిభను కనబరిచి అవార్డులు సాధించారు. రాజమహేంద్రవరంలోని ఎస్‌కెవిటీ కళాశాలలో శుక్రవారం జరిగిన ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో స్థానిక విద్యార్థులు పాల్గొన్నారు. అందులో ఓ.రోహిత్ (65 కేజీలు) ఎ.రాజేష్ కుమార్ (80కేజీలు) విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే కురాష్ పోటీలకు సంబంధించి నారాయణ (45 కేజీలు), ప్రసాద్ (40 కేజీలు), జాన్ రూపేష్ (45 కేజీలు), విలియం జోషి (55 కేజీలు), రాజ్ కుమార్ (60 కేజీలు), సుజిత్ కుమార్, లలిత కుమారి, గంగోత్రి (50 కేజీలు) దిగువలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడలో త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఈ విద్యార్థులందరూ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించినున్నట్లు ప్రధానోపాధ్యాయుడు బి.శివరామ్ కుమార్, పీడీ సత్తిబాబు తెలిపారు.

సత్తాచాటిన విద్యార్థులు

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెంలో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీల్లో మోరి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు సదరు హెచ్ఎం ఎస్.శ్రీధర్ కృష్ణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ విభాగాల్లో విద్యార్థులు 13 గోల్డ్, 16 సిల్వర్, 4 బ్రాంజ్ పథకాలు సాధించినట్లు ఆయన చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అయినవిల్లి: నల్లచెరువులోని చుట్టుగుళ్లవారిపేటకు చెందిన చుట్టుగుళ్ల ఏడుకొండలు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. ఏడుకొండలు (47) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండగా ఈ నెల 9న నొప్పి భరించలేక గడ్డి మందు తాగాడు. అతన్ని కుటుంబసభ్యులు అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రణభేరిని విజయవంతం చేయండి

మామిడికుదురు: గుంటూరులో ఈ నెల 25న యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు పిలుపునిచ్చారు. మామిడికుదురు ఎమ్మార్సీ వద్ద శనివారం రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాల సాధన కోసం రణభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నామని కేశవరావు తెలిపారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు జి.నాగేంద్రప్రసాద్, సాయిబాబు, అరుణ జ్యోతి పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రాజ్‌కుమార్



ఎంపీడీవోకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏవో

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా పీఆర్‌సీ రాజ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో సూర్యనారాయణ, ఏవో సోమేశ్వరీ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

ప్రతి ఇంట్లో పారిశ్రామికవేత్త ఉండాలి

మామిడికుదురు: ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త ఉండాలన్నదే లక్ష్యమని డీఆర్‌డీఏ టి.జయచంద్ర గాంధీ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం డ్వాక్రా మహిళలకు ఉదయం రిజిస్ట్రేషన్ అవగాహన సదస్సు జరిగింది. గ్రూపు సభ్యుల్లో ఉన్న చిరు వ్యాపారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వారికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించి అండగా నిలిచేందుకు పలు ప్రోత్సాహాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అంజిబాబు, ఎంపీడీఓ బి.భవాని, లీడ్ బ్యాంక్ మేనేజర్ వర్మ, సర్పంచ్ తాతకాపు, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ తులసీరామ్, ఏపీఎం రమణ పాల్గొన్నారు.

శనైశ్చరునికి ప్రత్యేక పూజలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) స్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. ఆలయానికి టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ.1,79,755 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి మరో రూ.46,520 వచ్చిందన్నారు.

బాలాజీకి రూ.2.16 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రాతఃకాలంలో సుప్రభాత సేవతోపాటు తొలి హారతిని అర్చకులు వైభవోపేతంగా జరిపించారు. స్వామికి వివిధ సేవల ద్వారా రూ.2,16,920 ఆదాయం వచ్చిందని, నిత్య అన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.51,240 విరాళాలుగా అందించారని ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

అంబాజీపేట: సపక్ తక్రా అండర్– 14 విభాగంలో కె.జానకి, అండర్– 19 టేబుల్ టెన్నిస్ విభాగంలో విద్యార్థి భరణిలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ద్వితీయ స్థానాన్ని సాధించి రాష్ట్రస్థాయి జట్టుకి ఎంపికయ్యారని పీడీ కె.ఆదిలక్ష్మి తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం కడలి సాయిరామ్ అభినందించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ రామలింగేశ్వరరావు, ఉపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

చెట్టుపడి కుప్పకూలిన గోడ

రాజోలు: భారీ వర్షానికి మండల పరిషత్ కార్యాలయ గోడపై చెట్టు పడటంతో కూలిపోయింది. ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఉపాధి హామీ సిబ్బంది వర్షంతో ఆ ప్రాంతంలోనే ఉన్నారు. సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిన కొన్ని క్షణాల్లో చెట్టు పడిపోయిందని మండల పరిషత్ సిబ్బంది తెలిపారు. గోడ పడిపోయిన ప్రదేశాన్ని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏఓ సత్యనారాయణ పరిశీలించారు. రెండు రోజుల క్రితం వర్షానికి కార్యాలయ శ్లాబ్ పెచ్చులు ఊడిపడిపోయాయి.

దృఢ సంకల్పంతో పని చేయాలి

ఆలమూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని ఎంపీడీఓ రాజు పిలుపునిచ్చారు. ఎంపీపీ కార్యాలయంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ కార్యాలయం వద్ద ఉద్యోగులు, స్థానికులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాలుష్య రహిత మండలంగా తీర్చిదిద్దాలన్న దృఢ సంకల్పంతో అందరూ పని చేయాలని సూచించారు. అలాగే స్వచ్ఛాంధ్ర నిర్మాణ క్రమంలో ఈ– వ్యర్థాలను (ఎలక్ట్రానిక్) సరైన రీతిలో తొలగించకపోతే వాటి నుంచి వెలువడే రసాయనాలు ప్రమాదకరంగా పరిణమిస్తాయన్నారు. మండల పరిపాలన అధికారి ప్రకాష్, ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



బట్టేలంకలో పాఠశాలలకు సైన్స్ కిట్లను అందిస్తున్న డీఈఓ సలీం బాషా

మలికిపురం: రానున్న పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వం పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యా శాఖాధికారి సలీం బాషా సూచించారు. మండలంలోని బట్టేలంక ఉన్నత పాఠశాల వద్ద శనివారం అన్ని ఉన్నత పాఠశాలలకు మంజూరైన సైన్స్ కిట్‌లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని ఉన్నత పాఠశాలలోనూ అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రభుత్వం పాఠశాలలకు గ్రామాల్లో దాతలు అందిస్తున్న సేవలు, సహాయం మరువలేనిదన్నారు. రాబోయే రోజుల్లో కూడా పాఠశాలలకు గ్రామాల్లో పెద్దల సహాయ సహకారాలు ఇలానే కొనసాగాలని బట్టేలంక పాఠశాల దాతలను అభినందించారు. ఎంఈవోలు విజయశ్రీ, సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, పెద్దలు ముదునూరి గోపాల కృష్ణంరాజు, ముదునూరి విష్ణుమూర్తి రాజు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాల్‌కు అంతర్జాతీయ అవార్డు



విశాఖపట్నంలో అవార్డు అందుకుంటున్న పాస్టర్ పాల్

అయినవిల్లి: మండలంలోని సిరిపల్లికి చెందిన పాస్టర్ నక్కా పాల్ పీస్ ఐకాన్ అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. ఆపదలో ఉన్న వారికి అత్యుత్తమ సేవలు అందించినందుకు గ్లోబల్ పీస్ సమ్మిట్ అద్దంకి యోనా ఆధ్వర్యంలో ఈ అవార్డును విశాఖపట్నం ఎస్‌హెచ్ ఫంక్షన్ హాల్లో శనివారం అందుకున్నారు. మత్త్యూ హాంగ్ డైరెక్టర్ ఇంటర్నేషనల్ మైండ్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ కొరియా ఈ అవార్డును అందించారు. పాల్‌కు అవార్డు రావడంపై పలువురు నాయకులు, అధికారులు తదితరులు అభినందించారు.

PUBLIC NOTICE

UNGARALA VEERA VENKATA SATYANARAYANA, S/o. Suryanarayana, D.No. 4-26, Yelisettivaripalem, H/o.Billakurru, Kothapeta Mandal for loan from M/s. SHRIRAM FINANCE LTD., Chennai having branch office at Ravulapalem the security of the schedule mentioned property of him, If anybody has objection or attachments or any other interests over the properties should inform to the undersigned within 7 days from this day.
SCHEDULE : Dr. B.R. Ambedkar Konaseema District, Kothapeta SRO, Kothapeta Village and Panchayath, Kothapeta Mandal, Ward No.16, near D.No.16-9, R.S.No.649 an extent of 115.835 sq.yards in plot no.4 in srinivasa golden city is bounded by East: Land of Bandaru Satyananda rao etc - 44 feet; South: Site of Gurram Venkatesh - 43'6"; West: 20 feet width passage left for passage - 20'7"; North: site srighakollapu Lakshminarayana 44 feet. In between the above boundaries with all easement rights etc., therein.
D.V.V.S. MURTHY, Advocate Amalapuram Cell: 9848344577

PUBLIC NOTICE

RUDRAKSHALA DURGA PRASAD, S/o. Yesubabu, D.No. 5-152/1, Choppella, Alamuru Mandal for loan from M/s. SHRIRAM FINANCE LTD., Chennai having branch office at Ravulapalem the security of the schedule mentioned property of him, If anybody has objection or attachments or any other interests over the properties should inform to the undersigned within 7 days from this day.
SCHEDULE : Dr. B.R. Ambedkar Konaseema District, Alamuru SRO, Choppella, Alamuru Mandal, R.S.No.266-1 an extent of 169 sq.yards is bounded by East: 7 links width passage left by Matta Veerraju in this survey number - 22 feet; South: Land of Vasa Nagaveni - 73 feet; West: Land of Nagireddi Gangaraju 19'5"; North: 15 Links width passage left by Nagireddi Gangaraju - 73'10". In between the above boundaries with an iron shed there bearing D.No.2-340/1 with doors, doorways, electrical fittings etc., therein all easement rights etc., therein.
D.V.V.S. MURTHY, Advocate Amalapuram Cell: 9848344577

